క్లుప్తంగా

మోదీ బహిరంగసభకు తరలనున్న పార్టీ శ్రేణులు

రాయదుర్గం: ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున శేరిలింగంపల్లి నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లనున్నట్లు బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు మియాపూర్ న్యూకాలనీలోని శివాలయం నుంచి సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌కు ర్యాలీగా బయల్దేరతామన్నారు.

బసవేశ్వరుడి బోధనలు అనుసరణీయం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: బసవేశ్వరుడి బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. సమాజంలో మనుషులందరూ సమానమేనని, శ్రమకు మించిన సౌందర్యం లేదంటూ 12వ శతాబ్దంలోనే ఆయన ప్రచారం చేశారన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం తన పూర్వజన్మ సుకృతమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ నెల 16వ తేదీన బీరంగూడ చౌరస్తాలోమహాత్మ బసవేశ్వరుడి కాంస్య విగ్రహ ఆవిష్కరణ ఆహ్వాన పత్రికను గురువారం రాత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. విగ్రహ ఆవిష్కరణకు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వస్తారని చెప్పారు.

బీజేపీ డివిజన్ అధ్యక్షుడిగా నాగరాజు



పటాన్‌చెరు టౌన్: బీజేపీ డివిజన్ అధ్యక్షుడిగా నాగరాజు యాదవ్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాగరాజు యాదవ్ మాట్లాడుతూ...తనపై నమ్మకం ఉంచి నియమించినందుకు జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, ఇన్‌చార్జి జయశ్రీ,, రామకృష్ణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గడపగడపకు తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

నల్లగండ్లలో కార్పొరేటర్ పర్యటన

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్లలో కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి శుక్రవారం పర్యటించారు. స్థానికంగా నెల కొన్న డ్రైనేజీ సమస్యను ఆయన దృష్టికి తీసుకురాగా, వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఈ సందర్భంగా గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని స్థానికులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, తిరుపతి, గిరి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత కలిగిన వారికి పూర్తి సహకారం



మాట్లాడుతున్న జయేష్‌రంజన్

రాయదుర్గం: సృజనాత్మకత కలిగిన వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో సినీప్రెన్యూర్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ సెరిమనీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఏరంగంలోనైనా సాధారణ అభివృద్ధి కన్నా సృజనాత్మకతతో చేసిన పని అందరినీ ఆకట్టుకుంటుందన్నారు. టీహబ్ సీఈఓ ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గుడ్ ఫ్రైడే వేడుకలు




ఏసుక్రీస్తు జీవిత చరిత్ర నాటకం

హఫీజ్‌పేట్ : గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని మియాపూర్ కల్వరి టెంపుల్‌లో శుక్రవారం ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వరి టెంపుల్ వ్యవస్థాపకులు డాక్టర్ సతీష్‌కుమార్ ఏసుప్రభు యొక్క ప్రేమ, త్యాగం కనికరం, దయ, క్షమాపణ గురించి వివరించారు. అనంతరం ఏసుక్రీస్తు జీవిత చరిత్రపై నాటకం ప్రదర్శించారు. ఆరాధనలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.



పార్కులో ఆకట్టుకునేలా ఏర్పాటు చేసిన కోతి,నెమలి, కోడిపుంజు బొమ్మలు



స్తంభంపై ఏర్పాటు చేసిన పావురాల గూడు



వాకింగ్ ట్రాక్

పచ్చదనం.. ఆహ్లాదం



పార్కులో ప్రజల సందడి

కేరాఫ్ గుల్‌మొహర్‌కాలనీ పార్కు

శేరిలింగంపల్లి: ఆకట్టుకునే పచ్చదనం..ఆహ్లాదం, ప్రశాంత వాతావరణం.. పక్షుల కిలకిలరావాలు.. చారిత్రక రాతి సంపద, మహనీయుల శిల్పాలు, ఆకట్టుకుంటున్న పక్షుల బొమ్మలు కనపడతాయి ఆ పార్కులో అడుగుపెట్టగానే. పచ్చదనంతో అలరారుతోంది గుల్‌మోహర్‌కాలనీ పార్కు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని కాలనీ పార్కులలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో మానసికోల్లాసం, ఆహ్లాదపూరిత వాతావరణంలో సేదతీరేలా ఉండడం ఈ పార్కుకే సొంతం. పచ్చదనం, మట్టిపైన వాకింగ్ చేస్తూ కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మహనీయుల శిల్పాలను సైతం ఇక్కడ ఏర్పాటు చేశారు.

- గచ్చిబౌలి డివిజన్‌లోని గుల్‌మొహర్‌కాలనీలో 3.75 ఎకరాల స్థలాన్ని పార్కుకు కేటాయించారు. పచ్చదనం ఈ పార్కు ప్రత్యేకత.
- పార్కును 3 ఎకరాల్లో అభివృద్ధి చేయగా మిగిలిన ప్రాంతంలోని రాళ్లు, పొదలను సహజత్వం కోసం వాటిని అలాగే వదిలేశారు.
- పార్కులో వాకర్స్ కోసం 800 మీటర్ల ప్రత్యేక వాకింగ్‌ట్రాక్‌ను ఏర్పాటు చేశారు.
- అంతటా పచ్చనిచెట్లు, రకరకాల పూలమొక్కలు, పచ్చటి గడ్డితో ఈ పార్కు అలరాలుతోంది.
- పార్కులో పావురాలు, బాతులు, పక్షుల కిలకిలరావాలు పల్లెటూరి వాతావరణాన్ని గుర్తు చేస్తోంది.
- రూ.3.50 లక్షల వ్యయంతో ఆవుదూడ, జిరాఫీ, జింకల ఫైబర్ విగ్రహాలు పార్కులో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.
- కాలనీ ప్రజలు నిత్యం వాకింగ్, వ్యాయామం చేస్తూ, ఆహ్లాదపూరిత వాతావరణంలో సేద తీరుతున్నారు.
- ఇటీవలే జీహెచ్ఎంసీ అధికారులు వాకింగ్‌ట్రాక్‌కు మరమ్మతులు చేయడంతో పాటు పార్కు ప్రహరీ ఎత్తు పెంచి, ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశారు.
- మరిన్ని సౌకర్యాలు కల్పించి, ప్రస్తుత వాతావరణాన్ని కొనసాగిస్తే బాగుంటుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది.



పార్కులో ఆకర్షణీయంగా ఉన్న ఆవుదూడ, హంస విగ్రహాలు

శిల్పారామంలో వసంతోత్సవ్ ప్రారంభం



వర్క్‌షాప్‌లో పాల్గొన్న కళాకారులు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో శుక్రవారం నుంచి మూడురోజుల పాటు వసంతోత్సవ్ పేరిట నిర్వహించనున్న నృత్యోత్సవాల వర్క్‌షాప్‌ను నిర్వహించారు. సంగీతనాటక అకాడమీ అవార్డు నాట్యాచార్యులు పండిత్ రాజేంద్ర గంగాని , ఆర్తిశాఖేర్ ఆధ్వర్యంలోని వర్క్‌షాప్‌లో 60 మంది కథక్ కళాకారులు పాల్గొని మెళకువలను నేర్చుకోనున్నారు. నర్తకి నృత్యప్రదర్శనలో పద నర్తనం, హస్త విన్యాసం, అభినయం, తాళ లయ గతుల గురించి అవగాహన కల్పించనున్నారు. ప్రముఖ కథక్ కళాకారిణి అర్చన మిషర్, ఒడిసి కళాకారిణి సస్మితామిశ్ర బృందం జుగల్బంది ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. ఇందులో గణేశ వందన, పంచ దేవస్తుతి, సర్గం, బసంత పల్లవి, గురువందన, రాధాకృష్ణ, నృత్య సంగీత్ తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు.

మెడికవర్‌లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



మాదాపూర్: ప్రకృతితో కలిసి జీవించినప్పుడే మనిషి ఆరోగ్యంగా ఉంటాడని మెడికవర్ హాస్పిటల్స్ చైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్ అనిల్‌కృష్ణ తెలిపారు. మాదాపూర్‌లోని మెడికవర్ హాస్పిటల్‌లో శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వం లాగా మట్టికుండలో వంట చేయడం, చేతులతో తినడం, మజ్జిగ అన్నం తినడం, ఇంట్లోకి ప్రవేశించే ముందు పాదరక్షలు బయట ఉంచడం, త్వరగా రాత్రి భోజనం చేయడం, పొద్దున్నే లేవడం వంటి భారతీయ సాంప్రదాయ పద్ధతులను మనం అనుసరించాలని చెప్పారు. డాక్టర్ శరత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణం చెరువు సమీపంలోని మసీదులో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వెన్నవరం భూపాల్ రెడ్డిలు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్యశిబిరం



దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

హఫీజ్‌పేట్ : ప్రపంచ ఆరోగ్య దినోత్సవంను పురస్కరించుకొని శుక్రవారం మియాపూర్ మాతృశ్రీనగర్‌లోని పోతుకూచి సోమ సుందరం సామాజిక సేవా సంస్థలోని విద్యార్థులకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. చందానగర్‌లోని స్మిత దంత వైద్యశాల డా.శ్రీధర్‌రెడ్డి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా రామస్వామి యాదవ్ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం ఉండాలంటే నిత్యం నడక, వ్యాయామం, ధ్యానం, సాధ్యమైనంత వరకు తాజా ఆకుకూరలు పండ్లు, తృణధాన్యాలు తీసుకోవడం వలన ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు, అసోసియేషన్ సభ్యులు మల్లేష్, వాణి సాంబశివరావు, డాక్టర్ కౌశిక్, పాలం శ్రీను, విష్ణు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ
- రూ.130.65 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు

మియాపూర్: ఫ్లైఓవర్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే గాంధీ అధికారులకు సూచించారు. బీహెచ్‌ఇఎల్ చౌరస్తాలో రూ.130.65 కోట్ల రూపాయలతో చేపడుతున్న బ్రిడ్జి నిర్మాణ పనుల పురోగతిపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. జాతీయ రహదారి కావడంతో నిత్యం వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్మాణ వ్యర్థాలు, మట్టి కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. అదే విధంగా సర్వీస్ రోడ్డు పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. సర్వీస్ రోడ్డులో వ్యాపార సముదాయాల ముందు తీసిన గుంతలకు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ రామకృష్ణ, డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత...

మియాపూర్ డివిజన్ పరిధిలోని వేంకటేశ్వరనగర్ కాలనీకి చెందిన కె.గిరిజకు ముఖ్యమంత్రి సహాయనిధి రూ. 2 లక్షల 50 వేల రూపాయాల మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు.

చెరువు అభివృద్ధి పనులు పరిశీలన

మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని చెరువులను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. లక్ష్మీనగర్ కాలనీలోని నాయినమ్మ కుంట అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ రూ.1.25 కోట్లతో నాయినమ్మ కుంట చెరువు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. చెరువు చుట్టు కంచె ఏర్పాటు చేయలని తెలిపారు. కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, కాలనీవాసులు సాంబయ్య, రమణ, శ్రీధర్, మల్లికార్జున్‌రావు, ఈశ్వర్‌నాయుడు, కాలనీ వాసులున్నారు.



నూతన కాలనీలకు భగీరథ నీరు



మిషన్ భగీరథ ఓవర్‌హెడ్ ట్యాంకులను ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: మిషన్ భగీరథ ద్వారా నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలకు కూడా రక్షిత మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఇంద్రేశం గ్రామ పరిధిలోని పీఎస్ఆర్‌కాలనీలో రూ.88 లక్షలు, రామేశ్వరంబండ పరిధిలోని కాలనీలో రూ.43 లక్షలతో నిర్మించిన మిషన్ భగీరథ ఓవర్‌హెడ్ ట్యాంకులను ప్రజాప్రతినిధులతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణం నుంచి పల్లె వరకు ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి ఇప్పటికే మిషన్ భగీరథ మంచినీరు అందిస్తున్నామని, నూతన కాలనీలకు అందించేందుకు నిధులు కేటాయిస్తున్నామన్నారు. అనంతరం కాలనీవాసులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో నీటిపారుల శాఖ డీఈ శ్రీనివాస్, సర్పంచ్‌లు దండు నర్సింలు, ధరణి అంతిరెడ్డి, ఎంపీటీసీ మానెమ్మ, నేతలు అంతిరెడ్డి, రామచంద్రరెడ్డి, బండి శంకర్ పాల్గొన్నారు.

గౌలిదొడ్డిలో మౌలిక వసతులు కల్పించాలి

ఎమ్మెల్యేకు బీఆర్ఎస్ నాయకుల వినతి



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇచ్చిన గౌలిదొడ్డి బీఆర్ఎస్ నాయకులు

రాయదుర్గం: గౌలిదొడ్డిలో మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి స్థానిక బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఆయనను కలిసి తమ ప్రాంత సమస్యలను వివరించారు. గౌలిదొడ్డిలోని ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని, అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా, ప్రధాన రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని వారు కోరారు. ఇందుకు ఎమ్మెల్యే గాంధీ జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి పనులన్నీ దశలవారిగా చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గచ్చిబౌలి డివిజన్ మాజీ వార్డు కమిటీ సభ్యుడు రాగం జంగయ్యయాదవ్, దారుగుపల్లి పరమేష్ తదితరులు కలిశారు.

ఖాజాగూడలో సామాజిక న్యాయ వారోత్సవాలు



ఖాజాగూడలో స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు

రాయదుర్గం: బీజేపీ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలో భారతీయ జనతా పార్టీ యువమోర్చా ఆధ్వర్యంలో సామాజిక న్యాయ వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం బీజేవైఎం గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షులు నక్క శివకుమార్ ఆధ్వర్యంలో ఖాజాగూడ ప్రధానరోడ్డులో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ వ్యతిరేక శక్తులపై పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఉందన్నారు.అనంతరం మధురానగర్‌లో బీజేపీ నాయకులు పెద్దగోని సతీష్‌గౌడ్ నివాసంలో సహపంక్తి భోజన కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యదర్శి మూల అనిల్‌గౌడ్, బీజేపీ నాయకులు కృష్ణముదిరాజ్, నరేందర్ ముదిరాజ్, అమర్‌యాదవ్, ఆర్‌వెంకటేష్, అశోక్, దయాకర్, తిరుపతి పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో కనిపించని అభివృద్ధి



కాలనీలో పారిశుద్ధ్యాన్ని పరిశీలిస్తున్న రవికుమార్ యాదవ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో సాగుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్ పాదయాత్ర శుక్రవారం సిక్కుల బస్తీ, పీజేఆర్‌నగర్‌లలో సాగింది. మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లూరి రామరాజు, సీనియర్ నాయకుడు నరేందర్‌రెడ్డి, కుమార్ యాదవ్, రవీందర్‌రావు, మణిభూషణ్, కమలాకర్‌రెడ్డి, వేణు యాదవ్, నర్సింగ్ యాదవ్, నరసింహాచారి, రాజు, రఘు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి, డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయే తప్ప ఎక్కడా అభివృద్ధి కనిపించటం లేదన్నారు. పాదయాత్రలో పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయని వాటిపై దృష్టి సారిస్తామని తెలిపారు.

ఇరుకురోడ్డు.. ఇక్కట్లు

- మూసాపేట రోడ్డు విస్తరణ పనులు సాగక..
- ఉదయం, సాయంత్రం భారీగా ట్రాఫిక్ జామ్...

మూసాపేట: మూసాపేటలో ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, స్థానిక ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. కొన్ని సంవత్సరాలుగా రోడ్డు విస్తరణ పనులు కొనసాగు..తూనే ఉన్నాయి. ఈ సమస్యను పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పనులు మాత్రం జరగటం లేదు. మూసాపేట పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందుతుండడంతో జనాభా, వాహనాలు పెరుగుతున్నాయి. దానికి తగ్గట్టుగా చర్యలు తీసుకోకపోవడం .. అధికారుల అనాలోచిత నిర్ణయాలతో సమస్య మరింత జఠిలంగా మారింది. పైగా కైత్లాపూర్ వద్ద బ్రిడ్జిని నిర్మించటంతో అయ్యప్ప సొసైటీ, గచ్చిబౌలి, సైబర్‌సిటీకి వెళ్లే ప్రజలు కూకట్‌పల్లి నుంచి కాకుండా మూసాపేట నుంచి రాకపోకలు కొనసాగిస్తుంటారు. దీంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వచ్చే వేళల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రధాన రహదారికి మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయటంతో రోడ్డు తగ్గిపోయి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. మూసాపేట మీదుగా ప్రయాణం సాగించాలంటే వామ్మో.. అంటూ బెంబేలెత్తుతున్నారు.

- మూసాపేట చౌరస్తా నుంచి ఆంజనేయనగర్ చౌరస్తా వరకు 100 అడుగుల రోడ్డు వెడల్పు పనులు కొన్ని సంవత్సరాలుగా సాగుతున్నాయి. కొన్నిచోట్ల రోడ్డును విస్తరించి ఫుట్‌పాత్‌లు నిర్మించారు. వాటికి గ్రిల్స్ కూడా ఏర్పాటు చేశారు.
- కొన్ని రోజులకు ఆ గ్రిల్స్ తీసివేశారు. ప్రస్తుతం రోడ్డు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేశారు. దీంతో ట్రాఫిక్ సమస్యగా నెలకొంది.



ఫుట్‌పాత్ ముందు తోపుడుబండ్ల వ్యాపారాలతో ఇరుకుగా మారిన రోడ్డు

- మున్సిపల్ కార్యాలయం నుంచి చిత్తారమ్మ తల్లి ఆలయం వరకు ఫుట్‌పాత్ నిర్మించారు. ఫుట్‌పాత్‌ను దాటి రోడ్డుపై చిరువ్యాపారులు సాయంత్రం వేళలో తోపుడు బండ్లు పెట్టుకొని వ్యాపారం చేసుకుంటున్నారు.
- దీంతో వినియోగదారులు తమ వాహనాలను కూడా అక్కడే పార్కింగ్ చేయటం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడేది. ఇక డివైడర్ ఏర్పాటుతో రోడ్డు మరింత చిన్నదిగా మారింది.
- కైత్లాపూర్ వద్ద బ్రిడ్జిని నిర్మించటంతో అయ్యప్ప సొసైటీ, గచ్చిబౌలి, సైబర్‌సిటీకి వెళ్లే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వచ్చే వేళల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ప్రధాన రహదారిపై ట్రాఫిక్ అంతరాయం కారణంతో ద్విచక్ర వాహనదారులు బస్తీ గుండా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.
- ఫుట్‌పాత్‌లను తగ్గించి తోపుడు బండ్లను ఖాళీ ప్రదేశంలో ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవటమే కాక వీలైనంత త్వరగా రోడ్డు వెడల్పు పనులు పూర్తి చేస్తే బాగుంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

రోడ్డు ఇరుకు.. రద్దీ

నిత్యం సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. గతంలోనే ఫుట్‌పాత్‌ల వల్ల ఇబ్బందులు పడుతుంటే ప్రస్తుతం డివైడర్లు కూడా ఏర్పాటు చేయటంతో రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమైంది.

–పాతపల్లి శివశంకర్, మూసాపేట